అసాంఘిక కార్యకలాపాలకు
అడ్డాగా ఉదయగిరి

జోరుగా జూద స్థావరాలు
- 24 గంటలు అందుబాటులో మద్యం
- యువతను చిత్తు చేస్తున్న గంజాయి
- కొలువుల పేరిట నిషేధిత మాతమ్మ, జోగిని కార్యక్రమాలు
- మౌనవత్రం పాటిస్తున్న పోలీసు యంత్రాంగం

ఉదయగిరి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉదయగిరి నియోజకవర్గం అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారింది. వాటికి అడ్డుకట్ట వేయాల్సిన పోలీసు యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోంది. కొంతమంది అక్రమార్కులు పేట్రేగి ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ యువతను చెడుమార్గంలోకి నెట్టేస్తున్నారు. ఉదయగిరి నియోజకవర్గం జిల్లా కేంద్రానికి సుదూరంలో ఉండడంతో ఇక్కడ ఏమి జరుగుతుందో తెలిసే పరిస్థితి ఉన్నతాధికారులకు లేదు. పోలీసు విభాగంలో వివిధ నిఘా వర్గాలు ఉన్నా ఇక్కడ జరిగే అసాంఘిక కార్యకలాపాలను జిల్లా అధికారులకు చేరవేస్తున్నారా.. లేదా..అనేది ప్రశ్నగా మారింది. దీంతో మూడు పువ్వులుగా పేకాట, ఆరు కాసులుగా డైమండ్ డబ్బా జూదాలు సాగుతున్నాయి. కొల్వుల పేరుతో నిషేధిత మాతమ్మ, జోగిని కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. గంజాయి, గుట్కాల వంటి మత్తు పదార్థాలు యువతను చిత్తు చేస్తున్నాయి. 24 గంటలు మద్యం అందుబాటులో ఉండడంతో నిషా మత్తులో హత్యలు, లైంగికదాడులు చోటు చేసుకుంటున్నాయి. మరోవైపు ఇసుక, గ్రావెల్, ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిపోతోంది. వీటిని అరికట్టాల్సిన పోలీసు యంత్రాంగం మామూళ్ల మత్తులో చేతులు ఎత్తేసింది. దీంతో అక్రమార్కులు పేట్రేగిపోతూ శాంతిభద్రతలకు సవాల్‌గా మారారు.

➡ ఈ నెల 1న దుత్తలూరులో ఓ యువకుడు భార్య మీద అనుమానంతో అర్ధరాత్రి వేళ మద్యం సేవించి మత్తులో విచక్షణ కోల్పోయి కత్తితో భార్యపై దాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో అడ్డు వచ్చిన అత్తమామలను అంతం చేశాడు. అర్ధరాత్రి మద్యం అందుబాటులో ఉండడంతోనే ఘాతుకం జరిగిందని స్థానికులు వాపోతున్నారు.



పెద్దిరెడ్డిపల్లిలో అంకాళమ్మ తిరునాళ్లలో డైమండ్ డబ్బా నిర్వహిస్తున్న దృశ్యం

➡ జూన్‌లో వింజమూరులో గంజాయి మత్తులో ఓ విద్యార్థి తాను చదువుకునే పాఠశాలలో ఉపాధ్యాయుడిపై తిరగబడ్డాడు. ఇదే పాఠశాలలో మరో విద్యార్థి తన జూనియర్ నోట్లో బలవంతంగా మత్తు పదార్థం పోసిన ఘటన చోటు చేసుకుంది. ఈ విషయం బయటకు తెలిస్తే బాగుండదని ఉపాధ్యాయులు కప్పెట్టేశారు.

➡ నర్రవాడ వెంగమాంబ, ఉదయగిరి మండలం అడవి పేరంటాళ్లమ్మ, వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి అంకాళమ్మ, వింజమూరు మండలం గొట్టిగుండాల అంకాళమ్మ, జీ కొండారెడ్డిపల్లిలో కులదేవత కొలువుల సందర్భంగా డైమండ్ డబ్బాలు పోలీసు సమక్షంలోనే గలగలాడాయి. దైవ దర్శనం కోసం వచ్చిన కొంతమంది భక్తులు జేబులు ఖాళీ చేసుకుని ఇంటిదారి పట్టారు. మద్యం సైతం వరదలా ప్రవహించిన ఎక్సైజ్, సివిల్ పోలీసులు కన్నెత్తి కూడా చూడలేదు.

➡ గత నెల రోజులు నుంచి వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపల్లి, తూర్పురొంపిదొడ్ల, జీ కొండారెడ్డిపల్లి, విరువూరు, ఉదయగి మండలంలో దుంపవారిపల్లిలో వివిధ సామాజిక వర్గాలకు చెందిన వారి కులదేవతల కొలుపుల్లో మాతమ్మ తుడుపులు ,జోగిని నృత్యాలు జోరుగా సాగాయి. ముందస్తు సమాచారం ఉన్నా కూడా పోలీసులు పట్టించుకోలేదు. దీని మర్మం ఏమిటో వారికే ఎరుక.

➡ కొండాపురం, దుత్తలూరు, ఉదయగిరి, వింజమూరు, కలిగిరి మండలాల్లోని కొన్ని రహస్య స్థావరాల్లో ప్రతిరోజూ పేకాట జోరుగా సాగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి పెద్ద మొత్తంలో డబ్బులు పెట్టి ఆడుతున్నారు. ఈ వ్యవహారం వెనుక పోలీసు సిబ్బందిలో కొంతమంది పాత్ర ఉన్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు దాడులు చేయుటకు ముందే పేకాట నిర్వాహకులకు సమాచారం వెళ్తుండడంతో వారు వెంటనే తప్పించుకుంటున్నారు. ఉనికి కోసమే పోలీసులు దాడులు చేస్తూ మమ అనిపిస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి.

➡ ఉదయగిరి నియోజకవర్గాన్ని రెండు భాగాలుగా విభజించుకుని జలదంకి మండలానికి చెందిన ఓ వ్యక్తి, కడపకు చెందిన మరో వ్యక్తి రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ పోలీసులు పట్టుకున్న దాఖలాలు లేవు.

➡ ఇసుక, గ్రావెల్, మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నా అటువైపు కన్నెత్తి చూడడం లేదు. కూటమి నేతల హస్తం ఉండటంతో అధికారులు కూడా తమ వాటాలు తీసుకుని మిన్నకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జూద కార్యకలాపాలకు పోలీసులు, నిర్వాహకులకు ముందస్తు ఒప్పందం నడుస్తోంది. అశ్లీల నృత్యాలకు సంబంధించి పోలీసులకు నిర్వాహకులు కొంత మొత్తంలో అందజేయగా పచ్చజెండా ఊపేస్తున్నారు.ఈ విధంగా ఉదయగిరి నియోజవర్గం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారిపోయింది. జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి అదుపు చేస్తారా లేక వదిలేస్తారా అన్నది వేచి చూడాలి.



గండిపాళెంరోడ్డులోని మద్యం షాపులో సిట్టింగ్ రూంలో మద్యం సేవిస్తున్న దృశ్యం

శాకంబరిగా వాసవీమాత



ఆత్మకూరు: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం రాత్రి అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆలయంతో పాటు మూలవిరాట్టును కూరగాయలతో అలంకరించి లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఉభయకర్తలుగా బచ్చు సుధాకర్ దంపతులు వ్యవహరించారు.

7 నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

సీతారామపురం : మండలంలో ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు గిరిజనుల కోసం ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భార్గవిరెడ్డి శుక్రవారం తెలిపారు. 7న సీతారామపురం, 8న అయ్యవారిపల్లి, 9న బసినేనిపల్లి, 10న నెమళ్లదిన్నె, 11న పబ్బులేటిపల్లి గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు జరుగుతాయని చెప్పారు. ఈ క్యాంపుల్లో 0–6 పిల్లలకు ఆధార్ నమోదు చేయడంతో పాటు ఆధార్ కార్డులు పోగొట్టుకున్న వారికి నూతనగా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. గిరిజనులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

విద్యాసామగ్రి వితరణ



సంగం: సంగం పెన్నా బ్యారేజీ సమీపంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు విద్యాసామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. రక్షణ యూత్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు నరసింహులు ఎంఈఓ మల్లయ్య చేతుల మీదుగా 28 మందికి రూ.10వేలు విలువైన విద్యాసామగ్రిని అందజేశారు.

డీసీపల్లిలో 619 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి వేలం కేంద్రంలో శుక్రవారం 619 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 896 బేళ్లు రాగా, 619 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.160, సగటున రూ.216.98 ధర పలికినట్లుగా వివరించారు.

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం 474 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 570బేళ్లను తీసుకురాగా, 474 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.160, సగటున రూ. 211.52 ధర పలికిందని వివరించారు.

తహసీల్దార్‌కు సత్కారం



ఆత్మకూరురూరల్: మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన పద్మజాకుమారిని వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ప్రజాసమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి వల్లభనేని రాజేంద్ర, బోయలచిరివెళ్ల సర్పంచ్ వెంకటేశ్వర్లు యాదవ్, ధనాల రమేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



సంగం: విద్యార్థినులు వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను పాటించాలని సంగం పీహెచ్‌సీ వైద్యాధికారి అశోక్ సూచించారు.సంగంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలోని విద్యార్థినులకు శుక్రవారం ఆయన వైద్యపరీక్షలు నిర్వహించారు. రక్తహీనత, అనారోగ్యంతో బాధపడుతున్న బాలికలకు మందులు అందజేశారు. అనంతరం వసతిగృహాన్ని పరిశీలించారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు




అనుమసముద్రంపేట: నెల్లూరులో జరిగే రొట్టెల పండగ సందర్భంగా ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని ఎంపీడీఓ పద్మజాకుమారి అధికారులకు సూచించారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్, పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వాహనాల పార్కింగ్, బందోబస్తు, తదితర అంశాలపై చర్చించారు. తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎస్సై సైదులు, దర్గా ఈఓ హుస్సేన్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కాగా ఏఎస్‌పేట దర్గా వద్ద పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నిర్వహణను సంగం సీఐ వేమారెడ్డి పరిశీలించి ఎస్సై సైదులుకు సూచనలు చేశారు.

బీటీఏ సభ్యత్వ నమోదు

కొండాపురం: మండలంలోని సాయిపేట, కొండాపురం, కొమ్మి కాంప్లెక్స్‌ల పరిధిలో బహుజన టీచర్స్ అసోసియేషన్ సభ్యత్వ నమోదును శుక్రవారం చేపట్టారు. బీటీఏ జిల్లా అధ్యక్షుడు మణి సుబ్బు, మండల ప్రధాన కార్యదర్శి బీ మధు, అదనపు ప్రధాన కార్యదర్శి పదర్ల శ్రీనివాసులు, మండల కోశాధికారి డి.మనోహర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం ప్రార్థనలు



మర్రిపాడు: నందవరంలో పీర్ల ఊరేగింపు

మర్రిపాడు/ఉదయగిరి రూరల్: మొహర్రం సందర్భంగా ఉదయగిరిలోని గుంతబజార్, నాగులబావి వీధి ప్రాంతాల్లోని పీర్ల చావిడిలో శుక్రవారం పీర్లను ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాత్రి పట్టణంలో పెద్దపీర్ల ఊరేగింపును నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. మర్రిపాడు మండలం నందవరంలో చిన్న పీర్ల ఊరేగింపును నిర్వహించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ఉదయగిరి: బిజ్జంపల్లి ఉన్నత పాఠశాలలో



సీతారామపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో..



కావలియడవల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో..

ఉదయగిరి రూరల్: మండలంలోని బిజ్జంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన కే కృష్ణయ్యను సహచర ఉపాధ్యాయ సిబ్బంది, స్థానికులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఐదేళ్ల పాటు గణిత ఉపాధ్యాయుడిగా పనిచేసిన కృష్ణయ్య ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారన్నారు. ఆయన అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. హెచ్‌ఎం జే.మాధవరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: మండలంలోని కావలియడవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. బదిలీ అయిన హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, ఆంగ్ల, సోషల్, గణిత, పీఈటీ ఉపాధ్యాయులు ఇస్మాయిల్, నారే శ్రీనివాసులు, సుధాకర్, గురవయ్యతో పాటు కొత్తగా వచ్చిన హెచ్‌ఎం పూజల హరిబాబును గ్రామపెద్దలు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.సర్పంచ్ ముప్పూరి ధనమ్మ, మాల్యాద్రినాయుడు, మన్నం మోహన్‌రావు, రాయం వెంకటేశ్వర్లు, నాగినేని మస్తాన్‌రావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను హెచ్‌ఎం ప్రవీణ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం శ్రీనివాసులతో పాటు ఉపాధ్యాయులు విజయ్‌బాబు, అన్వర్‌బాషా, సుబ్బరాయుడు, సుధాకరయ్య, సుప్రజ, సుమతి, విద్యార్థన్‌రెడ్డి, వాణి, ప్రసాద్‌ను సహచర ఉపాధ్యాయులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

అదుపుతప్పి కారు బోల్తా

మర్రిపాడు: మండల పరిధిలో కంఢ్రిక నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్లకు చెందిన వారు కారులో నెల్లూరు నుంచి బద్వేలు వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో కంఢ్రిక సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి కారు అదుపుతప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ఘటనలో కారులోని ఇద్దరిలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, మరొకరు స్వల్పగాయాలతో బయటపడ్డారు.



కారులో నుంచి క్షతగాత్రులను బయటకు తీస్తున్న దృశ్యం

క్షతగాత్రులను 108లో ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మన్నెమాల అన్నపూర్ణమ్మ అంత్యక్రియలు

కావలి: కావలి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి మాతృమూర్తి మన్నెమాల అన్నపూర్ణమ్మ (94) అంత్యక్రియలు బంధువులు, అభిమానులు, శ్రేయోభిలాషులు అశ్రునయనాల నడుమ శుక్రవారం జరిగాయి. వృద్ధాప్య సంబంధిత సమస్యలతో అన్నపూర్ణమ్మ గురువారం రాత్రి కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, పట్టణానికి చెందిన వివిధ రంగాల ప్రముఖులు, పలువురు అభిమానులు కావలిలోని టీచర్స్ కాలనీలోని మన్నెమాల నివాసానికి చేరుకుని అన్నపూర్ణమ్మ భౌతికకాయానికి నివాళులర్పించి సుకుమార్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు.



అన్నపూర్ణమ్మ పార్థీవదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి


కొత్తపల్లి కౌరగుంటలో తాగునీటి ఎద్దడి



దగదర్తి: కొత్తపల్లికౌరగుంట పంచాయతీ పరిధిలోని ఎస్సీ, బీసీకాలనీల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. మంచినీటి పథకం మోటార్ నాలుగురోజుల క్రితం మరమ్మతులకు గురైంది. అప్పట్నుంచి పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఎస్సీ, బీసీ కాలనీలవాసులు తాగునీటికి అవస్థ పడుతున్నారు. మోటార్‌కు మరమ్మతులు చేయించాలని సచివాలయానికి వెళ్లి పంచాయతీ కార్యదర్శిని కోరినా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు. పంచాయతీలపై మండల అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఘనంగా అల్లూరి జయంతి

ఆత్మకూరు/ఆత్మకూరురూరల్/సోమశిల: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరులోని రవాణా శాఖ కార్యాలయంలో ఎంవీఐ ఎం రాములు, ఎల్‌ఆర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అల్లూరి చిత్రపటానికి అంగన్‌వాడీ కార్యకర్త షకీలా, ఆయా విజయమ్మ నివాళులర్పించారు. అలాగే ఆత్మకూరు మండలంలోని పాఠశాలల్లో అల్లూరికి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో అల్లూరు, పింగళి, వివేకానందుడి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఆత్మకూరులోని రవాణాశాఖ కార్యాలయంలో..

వీల్‌చైర్ వితరణ

ఆత్మకూరురూరల్: మురగళ్లకు చెందిన గార్లపాటి పెంచలయ్యకు ఆత్మకూరుకు చెందిన డాక్టర్ వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ ప్రణీత్ వీల్‌చైర్‌ను వితరణ చేశారు. ఇటీవల పెంచలయ్య పక్షవాతానికి గురై మంచానికే పరిమితమైన విషయాన్ని స్థానిక నాయకుడు, ట్రస్టు సభ్యుడు తోడేటి అశోక్ ట్రస్టు అధినేత డాక్టర్ ప్రణీత్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించారు. శుక్రవారం పెంచలయ్యకు అశోక్ ద్వారా వీల్‌చైర్‌ను అందజేశారు. దీంతో పెంచలయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రక్తదాన శిబిరం



ఆత్మకూరు: ఎల్‌ఐసీ ఎంప్లాయీస్ యూనియన్ వారోత్సవాల్లో భాగంగా ఆత్మకూరులోని ఎల్‌ఐసీ బ్రాంచ్‌లో శుక్రవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఎల్‌ఐసీ కార్యాలయ సిబ్బంది, యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఆత్మకూరు బ్రాంచ్ యూనియన్ అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి ప్రభాకర్, రెడ్‌క్రాస్ కార్యదర్శి సాధిక్ హుస్సేన్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ సందానీ, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్ర గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం

ఉదయగిరి/వరికుంటపాడు: వరికుంటపాడు మండలంలో శుక్రవారం రాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయాలపాలయ్యారు. దుత్తలూరు మండలం కొత్తపేటకు చెందిన బర్రె రవి, తాళ్లూరు కృపానందం బైక్‌పై పామూరుకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో వరికుంటపాడు సమీపంలోని వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద బైక్ అదుపు తప్పడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పోలీసులు 108 వాహనంలో ఉదయగిరి సీహెచ్‌సీకి తరలించారు. వీరిలో కృపానందం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు.

పందిని తప్పించబోయి..

వరికుంటపాడు మండలం కనియంపాడుకు చెందిన బిజ్జం కృష్ణారెడ్డి బైక్‌పై వరికుంటపాడుకు వచ్చి ఇంటికి తిరిగి వెళ్తున్నాడు. కనియంపాడు సమీపంలోని మనస్సు ఫౌండేషన్ కార్యాలయం వద్దకు రాగానే పంది ఎదురుగా వచ్చింది. దానిని తప్పించే క్రమంలో బైక్ అదుపు తప్పడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని స్థానికులు ఉదయగిరి వైద్యశాలకు తరలించారు. ఎస్సై రఘునాథ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాగునీటి కాలువల పరిశీలన



అల్లూరు: అల్లూరు చెరువు ఆయకట్టుకు సాగునీరందించే ఏటీఎస్ ఛానల్‌తో పాటు ఇతర సాగునీటి కాలువలను జిల్లా ఇరిగేషన్ శాఖ ఎస్‌ఈ దేశ్ నాయక్ శుక్రవారం పరిశీలించారు. ఏటీఎస్ ఛానల్ ద్వారా 600 కూసెక్కులను సరఫరా చేయాల్సి ఉన్నా కట్టలు బలహీనంగా ఉండడంతో 300 క్యూసెక్కులను మాత్రమే సరఫరా చేస్తున్నామని తెలిపారు. సాగునీటి కాలువల కట్టలతో పాటు దెబ్బతిన్న షట్టర్లకు మరమ్మతులు చేయించేందుకు నివేదికలను సిద్ధం చేయించి త్వరితగతిన పనులను పూర్తి చేయించేందుకు కృషి చేస్తామన్నారు. ఆయన వెంట సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, డీఈ పెంచలయ్య, ఏఈ సుధీర్ ఉన్నారు.

ఎంప్లాయీస్ యూనియన్ ధర్నా



ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి మేకపాటి చిన్నారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్టీసీ సంస్థను రాష్ట్ర ప్రజారవాణా శాఖకు బదిలీ చేస్తూ ప్రభుత్వంలో విలీనం చేసిందన్నారు. అయితే ఇప్పటి వరకు అందుకు అనుగుణంగా ఆర్టీసీ ఉద్యోగులకు ఏడాది క్రితం ఏర్పడిన ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగుల పదోన్నతులకు వెంటనే అనుమతులు ఇవ్వాలని, ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పదివేల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డిపో శాఖ అధ్యక్షుడు ఫకీరుసా, గ్యారేజ్ సెక్రటరీ మల్లికార్జున మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్ ప్రకారం ఉద్యోగుల భద్రత కోసం చర్యలు తీసుకోవాలన్నారు. విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాట్యూటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ భర్తీ చేయాలన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. యూనియన్ జాయింట్ సెక్రటరీ ప్రకాష్‌రెడ్డి, ట్రెజరర్ వెంకటేశ్వర్లు, యూనియన్ నాయకులు నరసయ్య, రాజశేఖర్, వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న హుస్సేనమ్మ

ఉదయగిరి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణాధికారిణి హుస్సేనమ్మ సూచించారు. మండలంలోని వెంగళరావునగర్‌లో శుక్రవారం ఆమె పర్యటించారు. ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో దోమలు ప్రబలి డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, తదితర విషజ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు దోమలు కుట్టకుండా దోమతెరలు వాడడం ద్వారా సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. గండిపాళెం పీహెచ్‌సీ వైద్యులు వినీత,సిబ్బంది నౌషద్‌బాబు, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న వెంకటరెడ్డి

ఉదయగిరి రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని 'మన' ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెంకట్రావుపల్లి ఉడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం చల్లా వెంకటేశ్వర్లు, పీఎంసీ చైర్మన్ షేక్ రసూల్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మన్నేటి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇళ్ల, పొలాల్లో మొక్కలను నాటి సంరక్షించిన విద్యార్థులకు గ్రీన్ పాస్‌పోర్ట్ అవార్డును అందజేస్తామన్నారు. సీనియర్ ఉపాధ్యాయుడు బలరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలి



మాట్లాడుతున్న వెలుగోటి రాములు

వింజమూరు(ఉదయగిరి): విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని విశ్రాంత ఐపీఎస్ అధికారి వెలుగోటి రాములు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఫ్యూచర్ కెరియర్‌పై శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెరియర్‌ను మన అసక్తులకు అనుగుణంగా ఎలా మలచుకోవాలి..పేదరికం నుంచి ఎలా బయటపడాలి, జ్ఞాపకశక్తిని ఎలా పెంపొందించుకోవాలి..తదితర అంశాలను వివరించారు. హెచ్‌ఎం పువ్వాడి నాగలక్ష్మి, విశ్రాంత హెచ్‌ఎం సీతారామయ్య ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో దుప్పి మృతి



ఉదయగిరి: స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల సమీపంలో శుక్రవారం కుక్కల దాడి చేయడంతో దుప్పి మృత్యువాత పడింది. దుర్గంపల్లి అటవీ ప్రాంతం నుంచి దుప్పి మంచి నీటి కోసం వచ్చింది. ఈ క్రమంలో కాలేజీ సమీపంలో ఉన్న కుక్కలు దానిపై దాడి చేశాయి. గమనించిన స్థానికులు కుక్కలను తరిమి దుప్పిని రక్షించే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే తీవ్రంగా గాయపడిన దుప్పి మృతిచెందింది. అటవీ శాఖ అధికారులకు సమాచారం తెలియజేయగా వారు దుప్పిని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం చేయించి పూడ్చి వేశారు.

రేషన్ డోర్ డెలివరీ చేయకపోతే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరు: దివ్యాంగులు, వృద్ధులకు రేషన్ సరుకులను డోర్ డెలివరీ చేయకపోతే డీలర్లపై చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు తహసీల్దార్ పద్మజాకుమారి, సీఎస్‌డీటీ ఏజే ఖాన్ హెచ్చరించారు.ప్రభుత్వ ఆదేశాలను భేఖాతర్ చేస్తూ డీలర్లు దివ్యాంగులు, వృద్ధులకు రేషన్ సరుకులు ఇవ్వకపోవడంపై 'సాక్షి'లో 'రేషన్ కష్టాలు' శీర్షికన శుక్రవారం కథనం వెలువడడంతో వారు స్పందించారు. రేషన్ డోర్‌డెలివరీ చేయలేదని ఆరోపణలు ఎదుర్కొంటున్న డీలర్లను తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి ఇకపై అలా జరిగితే లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించి రాతపూర్వకంగా రాయించుకున్నారు.